# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 30, మార్చి 2026


## ఏప్రిల్ 6న బాసరకు సీఎం రాక

### రూ. 300 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**భైంసా, మార్చి 29, ప్రభాతవార్త:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర సరస్వతీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీ నిధులు కేటాయించింది. ఏప్రిల్ 6న ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసరకు రానున్నారని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఆదివారం వెల్లడించారు. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి సుమారు రూ. 300 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. రూ. 100 కోట్లతో బాసర ఆలయ మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా ఆలయ పునర్నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసి, ముధోల్‌లో రూ. 200 కోట్లతో నిర్మించనున్న సమీకృత పాఠశాల భవన నిర్మాణానికి సంబంధించిన భూమి పూజ కార్యక్రమాన్ని బాసరలోనే నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనప్పటికీ మిగతా 2లో..

## చెన్నూరు సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో..

### పురుగుల మందు తాగి

# విద్యార్థిని ఆత్మహత్య





- గంగారం గ్రామానికి చెందిన విద్యార్థిని శ్రీ హిందు ఆదివారం చికిత్స పొందుతూ మృతి
- పాఠశాల సిబ్బంది వేధింపులతోనే మా బిడ్డ చనిపోయిందని కుటుంబ సభ్యుల ఆరోపణ
- తినుబండారాలను అనుమతించని సిబ్బంది, లోపలికి పురుగుల మందు ఎలా వచ్చింది
- మా బిడ్డ చావుకు కారకులైన వారిని శిక్షించాలని నిరసన

2లో..

**చెన్నూరు, మార్చి 29, ప్రభాతవార్త**

చెన్నూరు సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థి ఆత్మహత్య సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థిని మరణ వార్త చెన్నూరు మండలాన్ని ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. విద్యార్థిని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని గంగారం గ్రామానికి చెందిన రాళ్ళబండి శ్రీహిందు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతోంది. మూడు రోజుల క్రితం పురుగుల మందు సేవించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రోజున తుది శ్వాస విడిచింది. ఈ సంఘటన తెలియగానే గంగారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## మురళీగూడ దాహానికి దారి...

# ఎమ్మెల్యే మాటతో కదిలిన యంత్రాంగం

- అసెంబ్లీలో గళమెత్తిన హరీష్ బాబు
- గంటల్లోనే స్పందించిన అధికారులు
- అత్యవసరంగా బోర్‌వెల్ పనులు ప్రారంభం



**పెంచికల్‌పేట్, మార్చి 29, ప్రభాతవార్త :** కొమరం భీం జిల్లా పెంచికల్ పేట్ మండలంలోని మురళీగూడ గిరిజన గ్రామంలో నెలకొన్న త్రాగునీటి తీవ్ర సమస్యపై అసెంబ్లీలో శనివారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు గళమెత్తడంతో యంత్రాంగం అప్రమత్తమైంది. గ్రామ ప్రజలు పడుతున్న ఇబ్బందులను సభలో ప్రస్తావిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని చేసిన డిమాండ్ కు ప్రభుత్వం స్పందించింది. గ్రామంలో బోరు ఎండిపోవడం, మిషన్ భగీరథ సరఫరా సరిగా లేకపోవడంతో మహిళలు, వృద్ధులు కిలోమీటర్ల దూరం నడిచి నీళ్ళు తెచ్చుకునే దుస్థితి నెలకొన్న విషయం ఎమ్మెల్యే వివరించారు. నదులు సమీపంలో ఉన్నప్పటికీ త్రాగునీరు అందకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై సభలో చర్చ జరగడంతో సంబంధిత శాఖ అధికారులు వెంటనే చర్యలు ప్రారంభించారు. గ్రామంలో అత్యవసరంగా మూడు బోర్‌వెల్‌లు తవ్వించి తాత్కాలికంగా త్రాగునీటి సమస్యను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో గ్రామస్తులకు తాత్కాలిక ఉపశమనం లభించనుంది. ఎమ్మెల్యే ప్రస్తావనతో సమస్య పరిష్కార దిశగా చర్యలు ప్రారంభమైనందుకు గ్రామస్తుల వర్షం వ్యక్తం చేస్తున్నారు తక్షణ స్పందనతో బోర్ వెల్ ఏర్పాటు చేయడంతో ఎమ్మెల్యే హరీష్ బాబు చిత్రపటానికి గ్రామస్తులు పాలాభిషేకం చేశారు.



## శోభాయాత్ర ఏర్పాట్లపై పోలీసుల పర్యవేక్షణ

- రూట్ మ్యాప్‌ను పరిశీలించిన కాగజ్‌నగర్ డీఎస్పీ

– కాగజ్‌నగర్ రూరల్, మార్చి 29, ప్రభాతవార్త



2లో..

# గంజాయి సాగు బట్టబయలు



### మొక్కలు స్వాధీనం

**జైనూర్, మార్చి 29, ప్రభాతవార్త:** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు) మండలంలోని మారుగూడ గ్రామ పరిధిలో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో కలిసి పోలీసులు నిర్వహించిన దాడిలో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన కోవా అర్జున్ (37) తన వ్యవసాయ భూమిలో ఇతర పంటల మధ్య అంతర పంటగా గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సుమారు 2 నుంచి 3 అడుగుల మిగతా 2లో..

# ఏప్రిల్ 6న బాసరకు సీఎం రాక

**(మొదటిపేజీ తరువాయి)**

అప్పటి పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆలయ అభివృద్ధి పనులు ముందుకు సాగలేదని విమర్శించారు. ఈ విషయాన్ని పలుమార్లు అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లి, ముఖ్యమంత్రికి విన్నవించడంతో సానుకూలంగా స్పందించారని తెలిపారు. బాసర క్షేత్ర అభివృద్ధికి నిధులు కేటాయించి, స్వయంగా శంకుస్థాపనకు వస్తున్న ముఖ్యమంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటన బాసర ప్రాంతాభివృద్ధికి శుభపరిణామమని ఆయన పేర్కొన్నారు.

## పురుగుల మందు తాగి
# విద్యార్థిని ఆత్మహత్య

**(మొదటిపేజీ తరువాయి)**

ఈ సంఘటనపై కుటుంబ సభ్యులు మాట్లాడుతూ బుధవారం రోజున శ్రీహిందు వాంతులు చేసుకుందని, పాఠశాల సిబ్బంది చెన్నూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారని, మరుసటి రోజు మాకు సమాచారం అందించి విషయం తెలిపారన్నారు. ఫుడ్ పాయిజన్ కారణంగా వాంతులు చేసుకుందని మాకు తెలిపారని, రోజురోజుకు పాప ఆరోగ్యం క్షీణించడంతో మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించామని తెలిపారు. అక్కడి వైద్యులు పాపకు వైద్యపరీక్షలు నిర్వహించగా ఆమె పురుగుల మందు తాగిందని వైద్యులు తెలిపారనీ, ఆరోగ్యం క్షీణించడంతో ఆదివారం తెల్లవారుజామున శ్రీహిందు చనిపోయిందని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అయ్యారు.

### మా బిడ్డ చావుకు కారణం సిబ్బంది వేధింపులే..

మా బిడ్డ చావుకు కారణం పాఠశాల సిబ్బందేనని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మా పాప చనిపోవడానికి వేరే సమస్యలు ఏమి లేవని అన్నారు. పాప కోసం ఎప్పుడైనా తినుబండారాలు తీసుకువస్తే లోపలికి అనుమతించని సిబ్బంది, పురుగుల మందు లోపలికి ఎలా వచ్చిందని, ఎవరు అనుమతి ఇచ్చారని అనుమానం వ్యక్తం చేశారు. మా బిడ్డ పాయిజన్ తాగాల్సిన అవసరం ఏమొచ్చిందని, ఎవరైనా తాగించారా.. లేక తాగేలా ఇబ్బందులకు గురి చేసారా అంటూ రోదించారు. పాప చావుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కుటుంబ సభ్యులు అధికారులను కోరారు.

# శోభాయాత్ర ఏర్పాట్లపై పోలీసుల పర్యవేక్షణ

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 29, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ పట్టణంలో ఏప్రిల్ 2న నిర్వహించనున్న శ్రీ వీర హనుమాన్ శోభాయాత్ర ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్, టౌన్ సీఐ ప్రేమ్ కుమార్‌తో కలిసి శోభాయాత్ర రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. ప్రముఖ ప్రాంతాల మీదుగా శోభాయాత్ర హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమయ్యే రాజీవ్ గాంధీ చౌరస్తా, భారత్ బేకరీ, గాంధీ చౌక్, మెయిన్ మార్కెట్ మీదుగా అంబేద్కర్ చౌరస్తా, తీరందాస్ టాకీస్ ప్రాంతాల గుండా ప్రయాణించి తిరిగి రాజీవ్ గాంధీ చౌరస్తా, శివాజీ చౌక్ మీదుగా బీఎంఎస్ కార్యాలయం నుంచి మళ్లీ హనుమాన్ ఆలయం వరకు కొనసాగనుంది. శోభాయాత్ర సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని డీఎస్పీ వహీదుద్దీన్ తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో టౌన్ సీఐ ప్రేమ్ కుమార్, హిందూ జాగరణ్ మంచ్ జిల్లా అధ్యక్షుడు శివా గౌడ్, సభ్యులు లెక్కల మురళి, బుక్క బాలు, అరుణ్ లోయ, శుభం లోయ, అనిల్, నరేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు మాజీ ఎమ్మెల్యే హామీ

**జైనూర్, మార్చి 29, ప్రభాతవార్త:**



జైనూర్ మండలంలోని పార గ్రామ పంచాయతీ పరిధిలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సానుకూలంగా స్పందించారు. ఆదివారం పార గ్రామ సర్పంచ్ మెస్రం జంగుబాయి జ్ఞానేశ్వర్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, గ్రామంలోని మౌలిక సదుపాయాల కల్పనపై వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సర్పంచ్ విన్నపం మేరకు గ్రామంలో తాగునీటి వసతి, పంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రజల కోసం షెడ్డు నిర్మాణం, సిమెంట్ రోడ్ల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా సుకుడుపల్లి గ్రామంలో నెలకొన్న నీటి ఎద్దడిని నివారించేందుకు త్వరితగతిన బోరుబావి మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# గంజాయి సాగు బట్టబయలు



**(మొదటిపేజీ తరువాయి)**

ఎత్తు పెరిగిన 8 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు సిర్పూర్(యు) ఎస్సై రామకృష్ణ తెలిపారు. వీటి విలువ సుమారు రూ. 80,000 ఉంటుందని అంచనా వేశారు. పోలీసుల విచారణలో నిందితుడు గంజాయి సాగు చేస్తున్నట్లు అంగీకరించాడు. నిందితుడిపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

### గంజాయి మొక్కలు సాగు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

**కెరమెరి, మార్చి 29, ప్రభాతవార్త:**

ప్రభుత్వ నిషేధిత గంజాయి మొక్కలు సాగు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎన్ మధుకర్ తెలిపారు జిల్లా ఎస్పీ నికిత పంత్ ఏ ఎస్పి చిత్తరంజన్ ఆదేశాల మేరకు ఆదివారం కెరమెరి మండలం గోయగం గ్రామపంచాయతీ పరిధి భీమన్ గొంది గ్రామానికి చెందిన సిడాం రాజు అనే వ్యక్తి తన ఇంటి పెరట్లో 05 గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు గుర్తించామన్నారు ఈ గంజాయి మొక్కల అంచనా విలువ సుమారు రూ.50,000/ ఉంటుందని తెలిపారు. ఈ మేరకు గంజాయి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించిన సందర్భంగా ఈ చర్యలు చేపట్టినట్లు వివరించారు. మాట్లాడుతూ, గంజాయి సాగు లేదా వినియోగం చట్ట విరుద్ధమని, ఇలాంటి చర్యలు ఎవరైనా గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. గంజాయి నిర్మూలనలో ప్రజలు పోలీసులకు సహకరించాలని, నిషేధిత పంటల సాగు నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జలీల్ హైమద్ బీట్ ఆఫీసర్ నజీర్ అలీ పిసి శ్రావణ్ తదితరులు ఉన్నారు.

## జైనూర్‌ను ప్రత్యేక నియోజకవర్గంగా ప్రకటించాలి: మాడవి ఆనందీశ్వర్

**జైనూర్, మార్చి 29, ప్రభాతవార్త:**

కొత్త నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో భాగంగా జైనూర్ మండలాన్ని ప్రత్యేక నియోజకవర్గంగా ప్రకటించాలని ఆదివాసీ పర్ధన్ పురోహిత్ సేవా సంఘం జిల్లా జాయింట్ ప్రధాన కార్యదర్శి మాడవి ఆనందీశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జైనూర్, లింగాపూర్, సిర్పూర్ (యు), నార్నూర్, కేరమేరి మండలాలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నాయని, వీటికి సరైన గుర్తింపు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జైనూర్‌ను నియోజకవర్గంగా చేస్తే ఆదివాసులతో పాటు ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాలు సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో త్రాగునీటి ప్రాజెక్టులు లేక రైతులు కేవలం వర్షాధార పంటలపైనే ఆధారపడుతున్నారని, పరిశ్రమలు లేక యువత వలస వెళ్తున్నారని తెలిపారు. స్థానిక ఆసుపత్రిలో సరైన వసతులు, వైద్యులు లేకపోవడంతో చిన్నపాటి చికిత్సకు కూడా ఆదిలాబాద్, కరీంనగర్, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సి వస్తోందని వివరించారు. పార్టీల తీతగా అందరూ కలిసి జైనూర్ నియోజకవర్గ ఏర్పాటు కోసం ఉద్యమించాలని, కుమ్రం భీం స్ఫూర్తితో పోరాడుదామని ఆయన పిలుపునిచ్చారు.

## పన్నులు చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధికి తోడ్పడాలి

**ఆసిఫాబాద్, మార్చి 29, ప్రభాతవార్త :**

ప్రజలు పన్నులు చెల్లించి ఆసిఫాబాద్ పురపాలక సంఘం అభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ కమిషనర్ గజానంద్ పేర్కొన్నారు. ఆదివారం పుర పరిధిలోని ఇళ్లకు వెళ్లి పన్నులు వసూలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 31 లోగా ఆస్తి పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగుస్తున్న నేపథ్యంలో పెండింగ్లో ఉన్న ఆస్తి పన్ను, నీటి పన్నులు,వ్యాపార లైసెన్స్ ఫీజులను వెంటనే చెల్లించాలని కోరారు. గడువులోపు పన్ను చెల్లించని పక్షంలో నిబంధనల ప్రకారం పెనాల్టీ పడుతుందని సూచించారు. పన్నులు సకాలంలో చెల్లించి పట్టణ ప్రగతిలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

## కొండగట్టుకు బయలుదేరిన 150 మంది హనుమాన్ భక్తులు

**లక్ష్మణచాంద, మార్చి 29, ప్రభాతవార్త**

లక్ష్మణచాంద మండలంలోని పార్‌పెల్లి గ్రామం నుండి సుమారు 150 మంది హనుమాన్ భక్తులు ఆదివారం కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరారు. గ్రామం నుండి కొండగట్టుకు వంద కిలోమీటర్ల దూరం ఉన్నప్పటికీ, అంజన్నపై గల అచంచలమైన భక్తితో భక్తులు జైశ్రీరామ్ నామస్మరణ చేస్తూ ప్రయాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 70 ఏళ్ల వృద్ధుడు కటకం లక్ష్మయ్య మాట్లాడుతూ.. తాను ఇప్పటివరకు 19 సార్లు కొండగట్టుకు నడుచుకుంటూ వెళ్లానని వెల్లడించారు. ఆయనతో పాటు వందలాది మంది భక్తులు ఉత్సాహంగా ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. గ్రామంలో భక్తి వాతావరణం నెలకొనగా, భక్తులకు గ్రామస్థులు ఘనంగా వీడ్కోలు పలికారు.



## ఎస్ఆర్ఐ మ్యాపింగ్‌తో డేటా ఖచ్చితత్వంపై దృష్టి

**- కాగజ్‌నగర్ తహసిల్దార్ మధుకర్**

**కాగజ్‌నగర్, మార్చి 29 ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని నజ్రూల్‌నగర్ గ్రామంలో ఎన్నికల విభాగం ఆధ్వర్యంలో (ఎస్ఆర్ఐ ) ఓటరు మ్యాపింగ్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పోలింగ్ స్టేషన్ల 12 నుంచి 18 వరకు అధికారుల బృందం సందర్శించి ఓటర్ల వివరాల నమోదును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ తహసీల్దార్ మధుకర్ పాల్గొని డేటా ఖచ్చితత్వంపై ప్రత్యేక దృష్టి సారించారు ఓటరు వివరాలు సరిగా నమోదు అయ్యాయా అనే అంశాన్ని తనిఖీ చేస్తూ సిబ్బందికి అవసరమైన సూచనలు అందించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు ఎస్ఆర్ఐ మ్యాపింగ్ కీలకమని అధికారులు తెలిపారు. ఎక్కడైనా లోపాలు ఉన్నట్లయితే వెంటనే సరిచేస్తామని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు తమ వివరాలను ధృవీకరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ గౌరంగ్ మండల్, ఎన్నికల సిబ్బంది సంతోష్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవ ర్యాలీ వాల్ పోస్టర్ల విడుదల

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 29, ప్రభాతవార్త :**



విశ్వజ్ఞాని, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించనున్న భారీ ర్యాలీకి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని మీరాతాయి అంబేద్కర్ దీక్ష భూమిలో అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా కుల, మత భేదాలకు అతీతంగా కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని జయంతి ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఏ ఒక్క కులానికి, వర్గానికి పరిమితమైన నాయకుడు కాదని, దేశంలోని సమస్త ప్రజల సమాన హక్కులు, అభ్యున్నతి కోసం కృషి చేసిన మహానుభావుడని కొనియాడారు. ఇంతటి గొప్ప చరిత్ర కలిగిన మహనీయుని జయంతి వేడుకలను కని విని ఎరుగని రీతిలో నిర్వహిస్తూ, అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా పాల్గొని భారత జాతి ఐక్యతను చాటుకుందామని కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటి సభ్యులు, పాల్గొన్నారు.

## రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలి

**- తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు పర్శ చంద్రశేఖర్**

**కాగజ్‌నగర్ రూరల్,మార్చి 29, ప్రభాతవార్త :**



పదవీ విరమణ పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగులకు అందించాల్సిన రిటైర్మెంట్ ప్రయోజనాలను ఆలస్యం చేయకుండా వెంటనే చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు పర్శ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం కాగజ్‌నగర్ మండలం కోసిని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించిన సదానందం పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యా అభివృద్ధికి సదానందం చేసిన సేవలు ప్రశంసనీయమని, ఆయనను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఉపాధ్యాయుడు నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎన్నో సమస్యలతో జీవితాన్ని సాగిస్తున్న ఉపాధ్యాయులకు కనీసం పదవీ విరమణ సమయంలో అందించాల్సిన ప్రయోజనాలు ఆలస్యం కాకుండా తక్షణమే చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జనహిత సేవా సమితి 9వ వార్షికోత్సవం



అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, సర్పంచ్ బల్గూరి అజయ్

## ఉల్లాస్ పథకంపై వయోజనులకు అవగాహన

**సారంగాపూర్, మార్చి 29, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని కౌట్ల (బి) గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉల్లాస్‌ఖి కార్యక్రమంపై వయోజనులకు అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పథకం ద్వారా నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి మాట్లాడుతూ.. చిన్నతనంలో బడికి వెళ్లి చదువుకోలేకపోయిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యత శాతాన్ని పెంపొందించేందుకు ఈ పథకం ఎంతో దోహదపడుతుందన్నారు. చదువుకోవాలనే ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బల్గూరి అజయ్, ఉప సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, వివోలు శోభ, నారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న సర్పంచ్ సిరం సుష్మా రెడ్డి

## అర్హులందరికీ సంక్షేమ పథకాలే లక్ష్యం: దేగాం సర్పంచ్ సిరం సుష్మారెడ్డి

**భైంసా, మార్చి 29, ప్రభాతవార్త:**

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని భైంసా మండలం దేగాం సర్పంచ్ సిరం సుష్మా రెడ్డి తెలిపారు. ఆదివారం దేగాం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నాయని పేర్కొన్నారు. గత పదేళ్ల ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణంపై నిర్లక్ష్యం జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ దశల వారీగా ఇళ్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాలేకర్ శివాజీ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## భారత సైన్యంలో అగ్నివీర్ నియామకాలు

### - నిర్మల్ జిల్లా యువతకు అవకాశం

**నిర్మల్, మార్చి 29, ప్రభాతవార్త:**

అగ్నిపథ్ పథకంలో భాగంగా భారత సైన్యంలో అగ్నివీర్‌గా చేరేందుకు నిర్మల్ జిల్లాలోని అర్హులైన పురుష అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. 2027 సంవత్సరానికి గాను ఈ నియామక ప్రక్రియ చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీనికి 8వ తరగతి లేదా అంతకంటే ఎక్కువ చదివిన వారు అర్హులని, అభ్యర్థులు 01.07.2005 నుండి 01.07.2009 మధ్య జన్మించి ఉండాలని, కేవలం వివాహం కాని పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఏప్రిల్ 1వ తేదీలోపు భారత సైన్యం అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ జాయిన్ ఇండియన్ ఆర్మీ డాట్ ఎన్ఐసి డాట్ ఇన్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ✪ నేత్ర, అవయవదానంపై విస్తృత అవగాహన

**బెల్లంపల్లి, మార్చి 29, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలోని తాపీ సంఘ భవనంలో జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో సదశయా ఫౌండేషన్ సహకారంతో 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నేత్ర, అవయవ మరియు శరీర దానంపై అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతిరమేష్ బాబు, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, సదశయా ఫౌండేషన్ అధ్యక్షుడు టి. శ్రవణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని స్వామి వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జనహిత సేవా సమితి వ్యవస్థాపక సభ్యులు గాడెపు దామోదర్, సభ్యులు ఆడేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 13 మంది నేత్ర దాతలను స్మరించుకుంటూ రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతిరమేష్ మాట్లాడుతూ, మనిషి మరణానంతరం శరీర భాగాలను వృథా చేయకుండా నేత్ర, అవయవ దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఉన్న అపోహలను తొలగించి, ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. తాము కూడా నేత్ర, అవయవ దానానికి అంగీకరించినట్లు తెలిపారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్ మాట్లాడుతూ, గత 9 సంవత్సరాలుగా జనహిత సేవా సమితి అందిస్తున్న సేవలు అభినందనీయమని, ప్రజలు మరింతగా దాన కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. సదశయా ఫౌండేషన్ అధ్యక్షుడు టి. శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, నేత్రదానం ద్వారా ఇద్దరికి చూపు ఇవ్వవచ్చని, అవయవ దానం ద్వారా ప్రాణాపాయంలో ఉన్న ఆరుగురికి ప్రాణదానం చేయవచ్చని వివరించారు. శరీర దానం ద్వారా వైద్య విద్యార్థులకు ఉపయోగపడుతుందని తెలిపారు. జనహిత సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు



ఆడెపు సతీష్ మాట్లాడుతూ, ఇప్పటివరకు 13 నేత్రదాన కార్యక్రమాలు నిర్వహించామని, నేత్రదానం అంటే కంటి మొత్తం తీస్తారని ఉన్న అపోహలు తప్పని, కేవలం కార్నియా మాత్రమే తీస్తారని వివరించారు. సంస్థ 2017 ఉగాది రోజు ప్రారంభమై, 9 సంవత్సరాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. ఈ సందర్భంగా 13 మంది నేత్ర దాతల కుటుంబ సభ్యులను శాలువాలు కప్పి, మెమొంటోలు అందజేసి సత్కరించారు. అలాగే దేహ దానానికి ముందుకు వచ్చిన మూడు దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సుమారు 200 మంది నేత్ర, అవయవ దానానికి అంగీకారం తెలుపగా, వారికి డోనర్ కార్డులు అందజేశారు. వాసన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు నేత్ర దానంపై అవగాహన కల్పిస్తూ, తమ సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, సేవా సంస్థల సభ్యులు, దాతలు, యువకులు, మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు

**బెల్లంపల్లి, మార్చి 29, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణ కేంద్రంలో గల సీఎస్ఐ చర్చ్‌లో మట్టల ఆదివారం రోజున బెల్లంపల్లి సీఎస్ఐ చర్చ్ సంఘంలో మట్టల ఆదివారం వేడుకలు అత్యంత భక్తి, భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. సంఘ కాపరి రెవరెండ్ సిహెచ్ అశోక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విశ్వాసులందరూ కలిసి యేసుక్రీస్తు యెరూషలేములో విజయోత్సాహంగా ప్రవేశించిన సందర్భాన్ని స్మరించుకున్నారు. సంఘ పెద్దలు, మహిళలు, యువకులు, పిల్లలు అందరూ మట్టలు చేతబట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. దేవుని స్తుతిగీతాలతో, ప్రార్థనలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగాయి. విశ్వాసులు హోషన్నా నినాదాలతో ప్రభువును మహిమపరచడం జరిగింది. ఈ కార్యక్రమం అంతా కూడా ఎంతో గంభీరంగా, భక్తి భావంతో నిర్వహించబడింది. దేవునికి మహిమ చేకూరే విధంగా జరిగిన ఈ మట్టల ఆదివారం వేడుకలు విశ్వాసులందరికీ ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచాయి.

## మునిపెల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**లక్ష్మణచాంద, మార్చి 29, ప్రభాతవార్త:**

లక్ష్మణచాంద మండలంలోని మునిపెల్లి గ్రామంలో పది లక్షల రూపాయల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్డు పనులను ఆదివారం ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ మేడిపెల్లి సునీత గంగాధర్ ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు ఈ నిధులను వెచ్చిస్తున్నామని, పనులను త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నూతికాడి రంజిత్ రెడ్డి, మాజీ సర్పంచ్ కమల్‌కోట్ వెంకట్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గురాల లింగారెడ్డి, నాయకులు కమల్‌కోట్ లింగారెడ్డి, షేర్ రాజారెడ్డి, నూతికాడి రాజారెడ్డి, చిన్నారుట్ల రాజు, అబ్బాడి నర్సారెడ్డి, సాహుస్సేన్, కుమ్మరి నారాయణ, గొల్ల నారాయణ, గుండ్ల సతీష్, చాకలి ప్రశాంత్ పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ సునీత

# అమ్మకు అక్షరమాల పరీక్ష

**వేమనపల్లి, మార్చి 29, ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉల్లాస్ పథకంలో భాగంగా మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో అమ్మకు అక్షరమాల కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా సాగిందని మండల విద్యాధికారి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. నిరక్షరాస్యత నిర్మూలనే ధ్యేయంగా సాగుతున్న ఈ విద్యా యజ్ఞం నేడు పరీక్షా నిర్వహణతో మరో కీలక ఘట్టానికి చేరుకుందని దానికి గాను విద్యా వాలంటీర్లు, ప్రధానోపాధ్యాయులు, వివిఓ లు సమిష్టిగా కృషి చేసి, చదువుకు దూరమైన తల్లులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు. ఈ క్రమంలోనే నేడు అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో సర్పంచులు, పాఠశాలల ప్రదానోపాధ్యాయుల సమక్షంలో అభ్యర్థులకు పరీక్షలను నిర్వహించారు. నీల్వాయిలో సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య, సుంపుటంలో దుర్గం భాగ్యలక్ష్మి తిరుపతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు టి. శంకర్ ఏపీఎం ప్రమోద, ఉప సర్పంచ్ దందేర మహేష్ ఇతర విద్యా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# భాస్కర్ల రాజేశానికి నల్ల వజ్రం పురస్కారం

## - గోదావరిఖనిలో ఘనంగా జాతీయ స్థాయి ఉగాది పురస్కారాల ప్రదానం

**నస్పూర్, మార్చి 29, ప్రభాతవార్త**



వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి ఆదివారం గోదావరిఖనిలో నల్ల వజ్రం పురస్కారాలను ప్రధానం చేశారు. తారా ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు సంకె రాజేశం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఉగాది పురస్కారాల వేడుకలో ఈ అవార్డులను అందజేశారు. సింగరేణి కోల్‌బెల్ట్ వ్యాప్తంగా ఉన్న 11 జిల్లాల్లో సామాజిక, వృత్తిపరమైన సేవలు అందించిన వారిని ఈ పురస్కారాలకు ఎంపిక చేశారు. శ్రీరాంపూర్ ప్రాంతానికి చెందిన సీనియర్ రిపోర్టర్, తెలంగాణ ఉద్యమకారుడు భాస్కర్ల రాజేశం సామాజిక సేవలను గుర్తించి ఆయనకు నల్ల వజ్రం పురస్కారం2026 అందించారు. నేషనల్ ఎస్సీ మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి ఈ అవార్డును రాజేశానికి అందజేశారు. గత 30 ఏళ్లుగా శ్రీరాంపూర్ సింగరేణి ప్రాంతంలో విలేకరిగా కొనసాగుతూనే తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నందుకు ఈ గుర్తింపు లభించింది. సకల జనుల సమ్మె సమయంలో జేఏసీ కోకన్వీనర్‌గా రాజేశం సేవలు అందించారు. తన సేవలను గుర్తించి ఈ పురస్కారం అందజేసినందుకు తారా ఆర్ట్స్ అకాడమీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, వివిధ రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



# ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**జన్నారం, మార్చి 29, ప్రభాతవార్త**

జన్నారం మండలం కిష్టాపూర్ గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆదిలాబాద్ పార్లమెంటరీ కార్యదర్శి పులిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ 44 ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండా ఎగురవేసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల వారి అభ్యున్నతి కోసమే కీర్తిశేషులు నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని కొనియాడారు. నిరుపేద ప్రజల కోసం ఎన్నో పథకాలు శ్రీకారం చుట్టారని, రాజకీయాల్లో కొత్త బడికి నాంది పలికిన గొప్ప మహోన్నత వ్యక్తి నందమూరి తారక రామారావు అని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీని అన్ని రంగాల్లో ముందుకు నడిపిస్తున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు గ్రామస్తులు పాల్గొన్నారు.

**నస్పూర్, మార్చి 29, ప్రభాతవార్త**

మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని శ్రీరాంపూర్ ఏరియాలో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి సంబరాలు నిర్వహించారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ఎన్టీఆర్ స్థాపించిన పార్టీ నేటికీ ప్రజాక్షేత్రంలో బలంగా ఉందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ప్రచార కార్యదర్శి పెద్దపల్లి శంకర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తలారి రాజు, మంచిర్యాల కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి గరిగంటి రాజయ్య, టిడిపి నాయకులు బుజ్జేటి మల్లయ్య, దేశిని తిరుపతి సహా పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉల్లాస్ పథకంలో భాగంగా నిరక్షరాస్యులకు పరీక్షలు

**జన్నారం, మార్చి 29, ప్రభాతవార్త**

ఉల్లాస్ పథకంలో భాగంగా మండలంలోని పొనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని నిరక్షరాస్యులైన వయోజన మహిళలకు ఆదివారం రోజున మండల కేంద్రంలోని జిల్లా బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాన్ని జిల్లా వయోజన విద్యాధికారి ఏ. పురుషోత్తం సందర్శించారు. పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, మంచిర్యాల జిల్లాను 100 శాతం అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దాలని అన్నారు. నిరక్షరాస్యతను నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లాస్ పథకాన్ని అమలు చేస్తున్నాయని, దీనిలో బాగా 15 ఏళ్ల పైబడిన నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా మార్చేందుకు చదవడం రాయడం నేర్పించడమే ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ ఏ. సత్యనారాయణమూర్తి, ఏపిఎం లలిత కుమారి, డిఆర్పి కందుల తిరుపతి, ఎం సుమన్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

# మ్యాంగో గార్డెన్, డెస్టినేషన్ వెడ్డింగ్ హాల్స్ ప్రారంభం

**లక్షెట్టిపేట, మార్చి 29, ప్రభాతవార్త**

లక్షెట్టీపేట మండలం సూరారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మంచిర్యాల మ్యాంగో గార్డెన్, రిసార్ట్‌ను ఆదివారం రోజు మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ.. యాజమాన్యానికి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సురేఖని శాలువాతో సన్మానించారు.. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య–మహేష్, లక్షెట్టిపేట్ మున్సిపల్ చైర్మన్ దొంత అంజలి –నర్సయ్య, వైస్ చైర్మన్ మోతుక్కూరు రాజేశ్వరివెంకట స్వామి గౌడ్, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న మాజీ డిసిసి అధ్యక్షురాలు

# గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుంది

## - మాజీ జడ్పీటీసీ ఆర్ సంతోష్ కుమార్

**వేమనపల్లి, మార్చి 29, ప్రభాతవార్త**



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని మాజీ జెడ్పిటిసి ఆర్. సంతోష్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని నాగారం గ్రామపంచాయతీలో ఎంఎన్ఆర్ఈజిఎస్ నిధుల నుండి మంజూరైన రూ.20 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ సర్పంచ్ ముల్కల్ల శ్రీలత తో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందన్నారు. గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తమ వంతుగా ప్రత్యేకంగా నిధులు కేటాయించిందని దీనిలో భాగంగా సిసి సిమెంట్ రోడ్డు మంజూరు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ గాలి మధు, నీల్వాయి సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య, వేమనపల్లి సర్పంచ్ వుప్పలపు సాయి కృష్ణ, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ముల్కల్ల సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ ఒడిల రాజన్న, నైతం శంకర్, నీకాడి భగవంతు నాయకులు మధుసూదన్, కాయిత తిరుపతి, పెరుగు రామ్ దాసు, సుధాకర్ రెడ్డి, లచ్చిరెడ్డి, పర్వతాలు, శ్రీశైలం, మంత్రి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# జెఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా మోకనపల్లి బద్రి ఎన్నిక

**మందమర్రి, మార్చి 29 ప్రభాతవార్త**



మోకినపెల్లి బద్రిని సన్మానిస్తున్న జర్నలిస్టులు

మందమర్రి పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు మోకనపల్లి బద్రి జెఎస్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంచిర్యాల జిల్లా కిడ్స్ ప్లే స్కూల్ ఆవరణలో నిర్వహించిన జెఎస్ఎస్ జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నికలు జరిగాయి. జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన జర్నలిస్టులు పాల్గొని బద్రిని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా డి. వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిరిపురం మధు, జనరల్ సెక్రటరీగా మారేపల్లి వేణుగోపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా రాజయ్య, శనిగారపు వెంకటేష్ ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా స్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కుషనపల్లి సతీష్, మాదాసు శ్రీకాంత్ యాదవ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బద్రి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్ష పదవి అప్పగించిన జాతీయ అధ్యక్షుడు మానసాని కృష్ణారెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల హక్కుల కోసం అహర్నిశలు కృషి చేస్తానని, ప్రతి సమస్యలో ముందుండి పోరాడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాసాని రమేష్, దుర్గం వెంకటేష్, కుశలపెల్లి సతీష్, డాక్టర్ స్వామి, ఠాగూర్ సుశీల్, శేఖర్, ఆంజనేయులు, బీజోన్ రవి, జైపూర్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



పదవీ విరమణ సందర్భంగా సన్మానిస్తున్న పాఠశాల బృందం

## పదవీ విరమణ ఆత్మీయ సన్మాన కార్యక్రమం

**లక్షెట్టిపేట, మార్చి 29 ప్రభాతవార్త**

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల లక్షెట్టిపేటలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు రంగు సత్యనారాయణ పదవి విరమణ సందర్భంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం రోజు పాఠశాలలో ఈనెల 31న పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా ముందస్తుగా ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ డీఈఓ చందన్ (ఉట్నూర్) హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ శాఖలోని వివిధ పాఠశాలలో అనేక రకాలైన సేవలు అందించి పదవి విరమణ పొందుతున్న రంగు సత్యనారాయణను శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఆయన చేసిన కృషి ఎనలేనిదని అభినందించారు. భవిష్యత్తులో మంచి ఆరోగ్యంతో సంతోషంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో భాస్కర్, ఏసీఎంఓ లక్షుక్షు మ్మయ్య, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బండ జీవరత్నం, వార్డెన్ రేవతి, ఉపాధ్యాయులు పి. చందు, ఏ. రఘునాథం, ఎం శంకర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

## కొనసాగుతున్న చిరుతల రామాయణం


**వేమనపల్లి, మార్చి 29, ప్రభాతవార్త**

గత మూడు రోజుల నుంచి వేమనపల్లి మండలంలోని ముల్కలపేట గ్రామంలో నిర్వహిస్తున్న చిరుతల రామాయణం ప్రదర్శన ఆధ్యాత్మికంగా కనువిందు చేస్తుంది. ముల్కలపేట గ్రామ ప్రజలే కాకుండా సమీప గ్రామాల నుండి ప్రజలు తరలి వచ్చి ప్రదర్శనను తిలకిస్తున్నారు. ఈ మేరకు శనివారం సాయంత్రం జరిగిన ప్రదర్శనలో పలు ఘట్టాలను నిర్వహించారు. స్థానిక కళాకారులు రామాయణాన్ని కంఠస్థలం చేసుకొని, వివిధ పత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. సోమవారం రోజు రావణ సంహారం, శ్రీరామ పట్టాభిషేకం ప్రదర్శనకు మండల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి తిలకించాలని నిర్వాహకులు కోరారు.

## భైంసాలో మోక్ష ఫిజియోథెరపీ హాస్పిటల్ ప్రారంభం

**భైంసా, మార్చి 29, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన మోక్ష ఫిజియోథెరపీ హాస్పిటల్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణరావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరై ఆసుపత్రిని ప్రారంభించారు. డాక్టర్ గడ్డం బాలాజీ ఆధ్వర్యంలో ఈ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు మెరుగైన ఫిజియోథెరపీ వైద్య సేవలు అందాలని కోరారు. ఆధునిక కాలంలో పెరిగిన ఒత్తిడి, శారీరక సమస్యల పరిష్కారానికి ఫిజియోథెరపీ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ రామచంద్రారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ చంద్ర, ముత్యం రెడ్డి, తానూర్ ఎంపీపీ చంద్రకాంత్, పురంశెట్టి రవికుమార్, ఓంప్రకాష్, దేవీదాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.



# ఎండల వేళ దాహార్తికి చల్లని నీరు..

### - బాలాభారతి పూర్వ విద్యార్థుల సేవా కార్యక్రమం

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 29, ప్రభాతవార్త :**

వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికుల,ప్రజల దాహార్తిని తీర్చేందుకు బాలాభారతి పాఠశాల 1996-97 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ముందడుగు వేశారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిరి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కటుకం మధుకర్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేయడం ప్రశంసనీయమని అన్నారు. చదువుకున్న పాఠశాలపై గౌరవంతో పాటు సామాజిక బాధ్యతను గుర్తించి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఎండలు మండుతున్న వేళ ప్రయాణికులకు తాగునీరు అందించడం గొప్ప సేవగా పేర్కొన్నారు. అనంతరం దస్తగిరి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఐక్యమత్యంతో ముందుకు వచ్చి సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో, పీఆర్‌టియూ తెలంగాణ కొమురం భీం జిల్లా అధ్యక్షుడు తవటం శ్యాంసుందర్, బస్టాండ్ కంట్రోలర్ లక్ష్మణ్, పూర్వ విద్యార్థులు బూర కుమార్, పొన్న రమేష్,డి. రాజేశ్వర్, సంజయ్ కుమార్, కంబంపాటి సంతోష్,పి. తిరుపతి, శ్రీనివాస్, నక్క శంకర్, షఫి, రఫీక్, మున్సిపాలిటీ ఉద్యోగి, ఎండి ఇలియాజ్, చైతన్య అటవీ శాఖ, వి. శివ ప్రసాద్, హెల్త్ డిపార్ట్మెంట్, ఎన్. రాము, డి. శ్రీనివాస్,ప్రయాణికులు, స్థానిక ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్



పరీక్ష కేంద్రాన్ని సందర్శిస్తున్న డి ఆర్ డి ఓ దత్తారావ్

## సజావుగా అమ్మకు అక్షరమాల ఉల్లాస్ పరీక్ష

**ఆసిఫాబాద్, మార్చి 29, ప్రభాతవార్త :**

అమ్మకు అక్షరమాల ఉల్లాస్ పరీక్ష జిల్లా వ్యాప్తంగా సజావుగా జరిగింది. ఆదివారం ఆసిఫాబాద్ మండలం బూరుగుడ గ్రామంలోని అమ్మకు అక్షరమాల ఉల్లాస్ పరీక్ష కేంద్రాన్ని డి ఆర్ డి ఓ దత్తారావ్ సందర్శించారు. ఆయనతో పాటు ఏపీఎం, వివోఏలు కూడా హాజరయ్యారు. పరీక్ష కేంద్రంలోని ఏర్పాట్లు, వసతులను పరిశీలించి పరీక్షలు సజావుగా నిర్వహించేలా అధికారులకు సూచనలు అందించారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తెలిపారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి నిర్వహణపై సమీక్ష నిర్వహించారు.



బోయపల్లిలో జరుగుతున్న అమ్మకు అక్షరమాల పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన ఎంఈఓ శ్రీనివాస్, సర్పంచ్ శంకరమ్మ, నాయకులు

## మహిళలకు అమ్మకు అక్షరమాల పరీక్షలు

**తాండూర్, మార్చి 29, ప్రభాతవార్త :**

ఉల్లాస్ కార్యక్రమం భాగంగా మండలంలోని బోయపల్లి, నర్సాపూర్ తదితర గ్రామాల్లో ఆదివారం మహిళలకు అమ్మకు అక్షరమాల పరీక్షలు నిర్వహించారు. బోయపల్లిలో ఎంఈఓ దుర్గం శ్రీనివాస్, సర్పంచ్ సుందిల్ల శంకరమ్మ, నరసాపూర్లో ఐకెపి ఏపీఎం శ్యామల, సర్పంచ్ ప్రభాత్ రావు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా మార్చడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భువనగిరి. మధుసూదన్, ఉపసర్పంచ్ నల్లుల మహేష్, సింగిల్ విండో డైరెక్టర్ మాసాడి తిరుపతి, మాజీ సర్పంచ్ సుందిళ్ల భూమయ్య, ఎమ్మార్పీ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**పెంచికల్‌పేట్, మార్చి 28, ప్రభాతవార్త :**

పెంచికల్‌పేట్ గ్రామపంచాయతీ పరిధిలోని అరేవాడలో ఎమ్మెల్యే హరీష్ బాబు సహకారంతో ఉపాధి హామీ పథకం కింద మంజూరు అయిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం బీజేపీ నాయకులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో బురద, గుంతలతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు సీసీ రోడ్డు నిర్మాణంతో సౌకర్యవంతంగా ప్రయాణం చేయగలుగుతారని అన్నారు. ఎమ్మెల్యే హరీష్ బాబు కృషితో గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్యాల శేఖర్, నాయకులు అశోక్, రామన్న సత్యనారాయణ, నందు, వెంకట రత్నం తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేసిన నాయకులు

### పూర్వ విద్యార్థుల

## అపూర్వ సమ్మేళనం

**తాండూర్, మార్చి 29, ప్రభాతవార్త :**

మండలంలోని మాదారం టౌన్ షిప్ సింగరేణి కమిటీ హాల్ లో ఆదివారం పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 1989 నుంచి 2003 సంవత్సరం వరకు మాదారం సుభాష్ విద్యానికేతన్ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఒకచోట కలుసుకుని యోగక్షేమాలు తీసుకొని తమ మధురమైన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ గురువులను శాలువులతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

# 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి

**- డిపిఓ వెంకటేశ్వరరావు**

**తాండూర్, మార్చి 29, ప్రభాతవార్త :**

ఈనెల 30వ తేదీలోగా 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కొత్తపల్లి, తాండూర్, రాజీవ్ నగర్ గ్రామపంచాయతీలను డిపిఓ ఆదివారం తనిఖీ చేసి పలు కాలనీలలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. వసూలు చేసి ఇంటి పన్నుల వివరాలు ఆన్లైన్లో పొందు పరచాలని ఆదేశించారు. పన్నులు వసూలలో నిరక్ష్యం చేస్తే సంబంధిత కార్యదర్శులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతిరోజూ ఉదయం ఇళ్ల నుండి తడి, పొడి చెత్తను వేరు చేసి సేకరించాలని, సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించి, వర్మీ కంపోస్ట్ తయారీ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. నిల్వ ఉన్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, మురుగు కాలువల్లో పూడిక తీయడం, బ్లీచింగ్ పౌడర్, సోడియం హైపోక్లోరైట్ పిచికారీ క్రమ తప్పకుండా చేయాలన్నారు. నర్సరీ లో చెట్లకు నీరు పోయడం, కలుపు మొక్కల తొలగింపు వంటి పనులు నిరంతరం చేపట్టాలన్నారు. గ్రామంలోని కిరాణా దుకాణాలు, హోటళ్లు, మిల్లులు, ఇతర వాణిజ్య సంస్థల యజమానులను కలిసి ట్రేడ్ లైసెన్స్ తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లైసెన్స్ లేకుండా నడుపుతున్న వ్యాపార సంస్థలపై జరిమానా విధించి, వారి నుంచి ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూలు చేయాలన్నారు. పాత లైసెన్స్‌లను రెన్యూవల్ చేయించి నిధులను పంచాయతీ ఖాతాలో జమ చేయాలన్నారు. పంచాయతీలోని పలు రకాల రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, క్యాష్ బుక్, స్టాక్ రిజిస్టర్లను ప్రతిరోజూ నిర్వహించాలన్నారు. గ్రామంలో ఎక్కడా పగటిపూట వీధి దీపాలు వెలగకుండా చూడాలన్నారు పాడైన బల్బులను వెంటనే మార్చాలని, తాగునీటి సరఫరాలో లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించి, నీరు వృథా కాకుండా చూడాలన్నారు. ప్రస్తుతం వేసవిలో నీటి సరఫరా ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలన్నారు. బిపిఓ వెంట బెల్లంపల్లి డిఎల్పీఓ సతీష్ కుమార్, ఎంపీఓ అనిల్ కుమార్, సర్పంచ్ లు ఆకుల వెంకటేష్, మామిడాల లలిత, ముడిమడుగుల సురేష్, కార్యదర్శులు లక్ష్మణ్, దినకర్, తదితరులు ఉన్నారు.



మురికికాలువను పరిశీలించి కార్యదర్శి సూచనలు ఇస్తున్న డిపిఓ వెంకటేశ్వరావు



చదువుతోనే భవిష్యత్ మండలం విద్యాధికారి ఆశన్న

## చదువుకోవడానికి వయస్సు అడ్డు కాదు

**ఉట్నూర్, మార్చి 29, ప్రభాత వార్త :**

మండలంలోని లక్కారం ఎంపీపీఎస్ పాఠశాలలో ఆదివారం ఉల్లాస్‌చ కార్యక్రమంలో భాగంగా వయోజనులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కేంద్రాన్ని సందర్శించిన మండల విద్యాధికారి ఆశన్న. అనంతరం అయన మాట్లాడుతూ.. విద్య అనేది ప్రతి ఒక్కరి హక్కు అని, చదువుకోవడానికి వయసు అడ్డుకాదని పేర్కొన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ అవకాశాన్ని నిరక్షరాస్యులైన మహిళలు, వయోజనులు సద్వినియోగం చేసుకొని విద్యావంతులు కావాలని సూచించారు.

## ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

**ఉట్నూర్, మార్చి 29, ప్రభాత వార్త:**

ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉట్నూర్‌లో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు డీఎస్సీ సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్ సోమేశ్ తెలిపారు. ఎక్స్ రోడ్డు నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని, అనంతరం మహాధర్నా చేపడతామని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ పోరాటాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# కన్నుల పండుగగా హనుమాన్ శోభాయాత్ర



శోభా యాత్రలో పాల్గొన్న భక్తులు



హస్నాపూర్ గ్రామంలో ఆంజనేయ స్వాముల శోభాయాత్ర

**ఆసిఫాబాద్, మార్చి 29, ప్రభాతవార్త :**

కేస్లాపూర్ శ్రీ వీరంజనేయ స్వామి శోభాయాత్ర కన్నుల పండువగా కొనసాగింది. ఆదివారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ మందిరం నుండి ప్రారంభమైన శోభాయాత్ర జై శ్రీరాం.. జై హనుమాన్ అంటూ భక్తులు నృత్యాలు చేస్తు సాయిబాబా మందిరం నుంచి పలు వీధుల మీదుగా కొనసాగింది. అంతకుముందు హనుమాన్ ఉత్సవ విగ్రహానికి ఆలయ ప్రధాన అర్చకులు వొజ్జుల శిరీష్ శర్మ, వారణసి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు ధర్మపురి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గుండ వెంకన్న, కోశాధికారి పిన్న వివేక్, ఏకీరాల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి చిలుకూరి రాధాకృష్ణ చారి, మధు, తుజులపురం మురళీధర్ గౌడ్, ఏఎంసీ చైర్మెన్ ఇరుకుల్ల మంగ, మున్సిపల్ చైర్మన్ ఆకాష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గాదవేణి మల్లేష్, న్యాయవాది రాపర్తి రవిందర్, సతీష్ బాబు, కౌన్సిలర్లు చిలువేరి వెంకన్న రాపర్తి కార్తిక్, కుర్సెంగ బాలకృష్ణ, బిసి నాయకుడు డాక్టర్ రమేష్, భక్తులు పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ ఎస్హెచ్ఓ బాలాజీ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సైలు కోమరయ్య, కమలాకర్, పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తు మధ్య హనుమాన్ శోభయాత్ర ప్రశాంతంగా జరిగింది.

## శ్రీరాముడి పల్లకితో ఆంజనేయ స్వామి శోభయాత్ర ..

**ఉట్నూర్, మార్చి 29, ప్రభాత వార్త :**

మండలంలోని హస్నాపూర్ గ్రామంలో ఆదివారం ఆంజనేయస్వామి మాలదారులు గ్రామస్తులు శ్రీరాముడి పల్లకితో భారీ శోభాయాత్రలు నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన యాత్ర గ్రామంలోని విధుల గుండా కొనసాగింది. అంతకుముందు ఆలయంలో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో భోగ్ భండారు నిర్వహించారు. పూర్ణకుంభంతో పల్లకితో భక్తి పాటలతో శోభాయాత్ర కొనసాగడంతో గ్రామమంతా ఆధ్యాత్మికత ఏర్పడింది. ఈ శోభ యాత్రలో స్వాములు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



బాధితుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న సర్పంచ్ వెంకటేష్, డిసిసి ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**తాండూర్, మార్చి 29, ప్రభాతవార్త :**

మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన మాజీ రిపోర్టర్ ఐలి రాజేశంకు రూ.2.45 లక్షలు, జంబోజుల ప్రసాద్ కు రూ. 26500ల మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆదివారం సర్పంచ్ ఆకుల వెంకటేశం, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యం, వివిధ కారణాలతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్య చికిత్స చేసుకునే నిరుపేద బాధితులకు సీఎంఆర్ఎఫ్ ఒక వరం లాంటిదన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ప్రవీణ్, నాయకులు మల్లేష్, వెంకటేష్ గౌడ్, స్వామి, రజిని, మహేష్ పాల్గొన్నారు.

## ఉల్లాస్ కార్యక్రమంలో సంఘ సభ్యులకు మూల్యాంకన పరీక్ష

**లింగాపూర్, మార్చి 29, ప్రభాతవార్త:**

లింగాపూర్ మండలంలోని సంఘాల సభ్యులందరికీ, ఉల్లాస్ నవభారత సాక్షరత కార్యక్రమం లో భాగంగా, మూల్యాంకన పరీక్ష నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపిఎం సూర్యకాంత్ మాట్లాడుతూ చదువుకు వయసు అడ్డు కాదు అని పట్టుదల ఉంటే ప్రతి ఒక్కరు చదవగలరని, ప్రతి సంఘ సభ్యులు కనీసం వారి సంఘంలో జరుగుతున్నటువంటి లావాదేవీలను అర్థం చేసుకొని చదవడం రాయడం నేర్చుకోవాలి, ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు భవిష్యత్తు లో ఉల్లాస్ కార్యక్రమం ద్వారా అందరూ ఐక్యమత్యంతో కలిసికట్టుగా ప్రతి ఒక్కరికి చదవడం రాయడం వచ్చే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘాల సభ్యులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు మడవి ప్రదీప్. జాదవ్ కైలాస్. మీనా. సువర్ణ. వివోఏ లు జ్యోతిరామ్ పాండురంగ్, బాలు, సోను కుమార్ బాబులాల్, తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించిన ఆడే గజేందర్

**నేరడిగొండ, మార్చి 29, ప్రభాతవార్త:**



నేరడిగొండ మండలంలోని కుమారి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ ఆడే గజేందర్ ఆదివారం పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్ల వద్దకు వెళ్లి పనుల పురోగతిని ఆయన ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఇళ్ల నిర్మాణ పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేద కుటుంబాలకు స్థిరమైన నివాసం కల్పించి, ప్రతి అర్హుడికి ఇల్లు అందేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.